క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర ఆరు అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు హాజరుకావాలని కోరారు.

మునేరు ఆయకట్టుదారుల సదస్సు

పెనుగంచిప్రోలు: వరదలకు మునేరు తువ్వ కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చటంతో పాటు ఆనకట్ట వద్ద మరమ్మతులు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. స్థానిక హరి గార్డెన్స్‌లో గురువారం మునేరు ఆయకట్టు దారుల సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తోందని, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ సందర్భంగా మునేరు ఆయకట్టు దారుల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్‌గా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, రైతు సంఘం సీనియర్ నాయకులు సీహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయానికి గురువారం గుంటూరుకు చెందిన పర్చూరి సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులు రూ.16,116 విరాళాన్ని ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. దీనిలో రూ.11,116 నిత్యాన్నదానానికి రూ.5 వేలు అంకమ్మ ఆలయ గోపురం వెండి తాపడానికి వినియోగించాలని కోరారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్

గౌరవరం(జగ్గయ్యపేట): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్ పేర్కొన్నారు. గ్రామంలోని మక్కా మసీదులో గురువారం హర్‌దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. క్యాబినెట్‌లో మైనార్టీలకు స్థానం కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. భవిష్యత్తులో ఆయనకు అండగా ఉండాలని తెలిపారు. అనంతరం పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఉద్దండు, మీరాసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా



కంచికచర్ల: పక్కాగా ఓటరు జాబితా తయారు చేస్తామని తహసీల్దార్ శంకరబాబు అన్నారు. మండలంలోని కంచికచర్ల, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, గండేపల్లి, కీసర గ్రామాల్లో గురువారం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్వోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్‌కు రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడానికి ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీఎల్వో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 15,18 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం

జగ్గయ్యపేట అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం 7వ సచివాలయం పరిధిలోని ముక్త్యాల రోడ్డు 15,18 వార్డుల్లో జరుగుతుందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ), పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు పాతపేట గడ్డ సప్తగిరి బ్యాంకు వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రభుత్వ విప్ ఉదయభాను పాల్గొంటారని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య.. పోషకాహారం

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల వసతులు
- ఆరోగ్యానికి జగనన్న గోరుముద్ద
- వారంలో మూడు రోజులు రాగి జావ.. ఐదు రోజులు గుడ్డు
- నియోజకవర్గంలో 14,457 మంది విద్యార్థులకు గోరుముద్ద



పెనుగంచిప్రోలులో జగనన్న గోరుముద్ద ఆహారం తీసుకుంటున్న విద్యార్థులు

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేస్తోంది. దీనిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారాన్ని అందజేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి, పౌష్టికాహారం అందించడానికి చర్యలు తీసుకుంది. నాడు–నేడు పేరిట పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దింది. పిల్లల చదువు కోసం అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను సమర్థంగా అమలు చేస్తోంది. విద్యార్థులకు బలమైన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పవచ్చని భావించారు. ఇందుకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథకాన్ని మరింత మెరుగు పరిచి జగనన్న గోరుముద్ద పేరిట పోషకాహారాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వమే రూ.కోట్లు వెచ్చించి పోషకాహారం పిల్లలకు అందేలా చూస్తోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 135 పాఠశాలలు ఉండగా 14,457 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న భోజనం తింటున్నారు. ఇతర పదార్థాలతోపాటు వారంలో మూడు రోజులు రాగిజావ.. ఐదు రోజులు గుడ్డు అందజేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ముండ్లపాడులో విద్యార్థులకు రాగిజావ (ఫైల్)

జగ్గయ్యపేట నియోజకవర్గంలో విద్యార్థుల వివరాలు...

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పెనుగంచిప్రోలు	33	2,983
జగ్గయ్యపేట	61	7,794
వత్సవాయి	41	3,580
మొత్తం	135	14,457

రాగిజావ ఎంతో ఇష్టం



రాగిజావ ఎంతో ఇష్టం. ఉదయం అందరూ రాగిజావ తాగటంతో ఆ రోజంతా చాలా ఉల్లాసంగా ఉంటాం. రోజు విడిచి రోజు రాగిజావ ఇస్తున్నారు. రోజూ గుడ్డు ఇస్తున్నారు. జగనన్న గోరుముద్ద చాలా బాగుంది.

–అక్షయ, 8వ తరగతి

ఇంటి కంటే మెండుగా



ప్రభుత్వం పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు ఎంతో పుష్టికరమైన ఆహారం అందిస్తోంది. ఇంటి కంటే మెండుగా రోజుకొక రకం ఆహారం అందిస్తున్నారు. విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల స్వరూపం మార్చేశారు.

–బత్తుల వెంకటనర్సు, పేరెంట్స్ కమిటీ చైర్మన్

పకడ్బందీగా అమలు



జగనన్న గోరుముద్ద పథకాన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వారంలో మూడు రోజుల పాటు రాగిజావ ఇస్తున్నాం. ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం వంటలు చేసేలా హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మన్లు పర్యవేక్షిస్తుంటారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ రుచి, శుభ్రతపై జాగ్రత్తలు వహిస్తున్నాం.

–ఎల్.చిట్టిబాబు, ఎంఈఓ, జగ్గయ్యపేట

ఆలయాలకు శ్రావణ శోభ



విద్యుత్ దీపాలంకరణలో మరిడి మహాలక్ష్మి ఆలయం

నందిగామ: శ్రావణమాసం నేపథ్యంలో పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలను గురువారం రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలోని మరిడి మహాలక్ష్మి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, కనకదుర్గమ్మ ఆలయాలను రంగు రంగు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం నేపథ్యంలో ఆయా ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి.

ముత్యాలమ్మ ఆలయంలో...

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీముత్యాలమ్మ ఆలయంలో అర్చకులు మార్తి సాంబశివశాస్త్రి పర్యవేక్షణలో అమ్మవారికి వెండి కవచంతో అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివకుమార్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులు కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



వెండి కవచ అలంకరణలోముత్యాలమ్మ

దాడి ఘటనలో ఇద్దరికి రిమాండ్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): దాడి ఘటనలో ఇద్దరికి రిమాండ్ విధించినట్లు ఎస్సై కె.కృష్ణబాబు గురువారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న గ్రామంలో ఎస్సీకాలనీకి చెందిన పెసర మల్లి శ్రీను ఇంటి వద్ద ఉన్నారు. అదే కాలనీకి చెందిన కుమారి, పాము కీర్తి, మందా దానమ్మకు శ్రీను కుమార్తె అరుణకు పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారు ఏదో విషయంపై దుర్భాష ఆడుతూ ఆమెపై దాడి చేశారు. అక్కడే ఉన్న శ్రీను నాకుమార్తెను ఎందుకు కొడుతున్నారని అడగటంతో యండ్రాతి నాగరాజు, రాములు ఇనుపరాడ్డుతో శ్రీనుపై దాడి చేసి పరారయ్యారు. దాడిపై బాధితుడు గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జగ్గయ్యపేట న్యాయమూర్తి 15రోజులు రిమాండ్ విధించారు.

ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న చైర్మన్, ఈవో, వైదిక కమిటీ సభ్యులు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అతి పురాతనమైన రాధాకృష్ణుల విగ్రహాలను పరిశీలించారు. రాధాకృష్ణుల విగ్రహాలతో పాటు చుట్టూ ఉన్న గోపికల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దేలా రంగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, మురళీ, కోట ప్రసాద్, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక దురాచారాలను పారదోలాలి

పటమట(విజయవాడతూర్పు): సామాజిక అసమానతలను, సాంఘిక దురాచారాలను పాటించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. నాస్తిక కేంద్రంలో సాంఘిక దురాచారాల నిర్మూలన అంశంపై గురువారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేరుకుపోయిన అవినీతి, అనాగరికత, దోపిడీ వ్యవస్థలను రూపుమాపాలని, స్త్రీలపై జుగుప్సాకరంగా జరుగుతున్న ప్రవర్తనలు అంతం కావాలన్నారు. ఉన్నత విద్యావంతుల కుటుంబాల్లోనూ స్త్రీలపై చులకన భావం పెరుగుతుందని, ఇది సమాజ శ్రేయస్సు కాదని చెప్పారు.

ఈ నెల 9న క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక సమానత మండలి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, బి.మణి, గోరా సైన్స్ డైరెక్టర్ జి.నియంత, దిలీప్ పాల్గొన్నారు.

ఇక మండల కేంద్రంగా జుజ్జూరు

- మండల వ్యవస్థ తొలినాళ్లలో మండల కేంద్రంగా జుజ్జూరు
- రాజకీయ కారణాలతో వీరులపాడునకు మార్పు
- జుజ్జూరు మార్పునకు ఎమ్మెల్యే సోదరుల కృషి

వీరులపాడు: జుజ్జూరును మండలకేంద్రంగా మారుస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1983లో నాటి ప్రభుత్వం వీరులపాడును మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి మండలకేంద్రంగా ఉన్న వీరులపాడులో కనీస వసతులు లేక అధికారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల అభివృద్ధి కూడా నామమాత్రంగానే జరిగింది. మండలంలో 22 గ్రామ పంచాయతీలుండగా సుమారు 60 వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడిన తొలి నాళ్లలో (1983) జుజ్జూరును మండల కేంద్రంగా గుర్తిస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

నాడు జుజ్జూరు నుంచి వీరులపాడునకు..


రాజకీయ కారణాలు, పలు సమీకరణలు, ఆయా ఒత్తిళ్ల కారణంగా మండల కేంద్రం జుజ్జూరు నుంచి వీరులపాడుకు తరలిపోయింది. జనాభా ప్రాతిపదికతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి రవాణా సౌకర్యం, నైసర్గిక స్వరూపం, పలు వనరులు పుష్కలంగా ఉన్న జుజ్జూరును కాదని వీరులపాడుకు మండల కేంద్రం తరలిపోవటం అన్యాయమని అప్పటి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానికులు అనేకమార్లు గత ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. 1983 నుంచి ప్రతి సాధారణ ఎన్నికలకు మండల కేంద్రం మార్పు అంశం ఆయా పార్టీల నాయకులకు జుజ్జూరు ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు.

పరిపాలనా సౌలభ్యానికి

2019 ఎన్నికల సమయంలో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు చేపట్టిన పాదయాత్రలో జుజ్జూరు మండల కేంద్రం అంశాన్ని ప్రజలు వివరించారు. వీరులపాడు మండల కేంద్రంగా ఉన్నా పరిపాలనా సౌలభ్యానికి అవరోధంగా ఉండటంతో పాటు మెజార్టీ ప్రజల ఆకాంక్ష అని గుర్తించిన జగన్‌మోహనరావు మండల కేంద్ర మార్పు విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించారు. ఆ తరువాత ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పలుసార్లు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

పరిపాలనా సౌలభ్యం నిమిత్తం, మెజార్టీ ప్రజల బలమైన ఆకాంక్షతో మండల కేంద్రంగా జుజ్జూరును ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మండల మార్పు అంశంపై హామీ ఇచ్చి నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే సోదరులకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



జుజ్జూరు గ్రామం

మండల కేంద్ర మార్పుకు విశేష మద్దతు..

జుజ్జూరును మండల కేంద్రంగా మార్చే అంశానికి విశేష మద్దతు వచ్చింది. 22 గ్రామ పంచాయతీలకు 18 పంచాయతీల బోర్డు సభ్యులు, తొమ్మిది వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు ఎనిమిది సంఘాల కార్యవర్గాలు ఆమోదం తెలపగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మెజార్టీ సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా మండల కేంద్ర మార్పు తీర్మానం ఆమోదించారు. రెండు ఉన్నత పాఠశాలలు, రెండు ఉర్దూ పాఠశాలలు, నాలుగు ప్రైమరీ పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, దాదాపు 175 డ్వాక్రా సంఘాల సభ్యులు జుజ్జూరు మండల కేంద్రంగా ఆమోదం తెలుపుతూ కలెక్టర్‌కు వినతిపత్రాలు పంపారు. ముఖ్యంగా 18 గ్రామాల నుంచి దాదాపు 5,500 మంది వినతిపత్రాలు, 3,500 మంది పోస్టు కార్డుల ద్వారా తమ మద్దతును కలెక్టర్‌కు పంపినట్లు సమాచారం. ఏదిఏమైనా జుజ్జూరును మండల కేంద్రంగా మార్చాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు విగ్రహాల తొలగింపు

ఎమ్మెల్సీ అరుణకుమార్



గాంధీ సెంటరును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: హైకోర్టు తీర్పుననుసరించే గాంధీ సెంటరులోని విగ్రహాలను తొలగించారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని విగ్రహాలు తొలగించిన గాంధీ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ తొలగించిన విగ్రహాలను నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంపై అతి త్వరలోనేఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గాంధీ సెంటరును అభివృద్ధి చేయాలని చూస్తుంటే టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకుంటున్నారని అరుణకుమార్ మండిపడ్డారు. దీనిపై టీడీపీ నాయకులు హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారని గుర్తు చేశారు. 17 నెలల తర్వాత న్యాయస్థానం స్టే కొట్టివేసి ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న మహనీయులు, రాజకీయ నాయకుల విగ్రహాలు తొలగించాలని తీర్పునిచ్చిందన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించామని టీడీపీ నాయకులతో సహా అందరు తెలియజేశామని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు విగ్రహాలు తొలగిస్తుంటే మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో సహా టీడీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అతి త్వరలోనే నందిగామ గాంధీ సెంటరులో లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న 'గాంధీ' విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు సురేష్‌బాబు, శివనాగేశ్వరరావు, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి వైపు గాంధీ సెంటర్ అడుగులు



విశాలంగా కనిపిస్తున్న గాంధీ సెంటర్

నందిగామ: గాంధీ సెంటర్ అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సెంటర్ లో పలుచోట్ల ఉన్న మహనీయులు, నాయకుల విగ్రహాలను అన్నింటినీ కూడా ఒకే వేదికపైకి తెచ్చి గాంధీ సెంటర్ ను మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రత్యేక దృష్టి పెట్టారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు పాలకులపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వాస్తవానికి గత ఏడాది అభివృద్ధి పనులు ప్రారంభమైనా పట్టణానికి చెందిన కొందరు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కోర్టు ఆదేశాలు, సూచనల ప్రకారం తీర్పుకు లోబడి అధికారులు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పలువురు మహనీయులు, రాజకీయ నాయకుల 14 విగ్రహాలను బుధవారం రాత్రి అధికారులు తొలగించి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భద్రపరిచారు. ప్రతిపక్షం హడావిడి చేయబోయినా సామాన్యులు మాత్రం అభివృద్ధి ముఖ్యమని ప్రశంసలు వర్షం కురిపిస్తున్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం



బోనస్ పంపిణీ చేస్తున్న మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాడి రైతులను కృష్ణా మిల్క్ యూనియన్ ఎంతో ప్రోత్సహిస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రంలో పాడి రైతులకు రూ. 1.50 కోట్ల బోనస్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ పాడి రైతులకు బోనస్, పశువులకు కావాల్సిన వైద్య సేవలను సకాలంలో అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు కూడా అధికంగా బోనస్‌లు ఇస్తున్నది కూడా యూనియన్ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు నాగేశ్వరరావు, మహేష్‌బాబు, వెంకటేశ్వరరావు, రామారావు, పాల శీతలీకరణ మేనేజర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించిన మున్సిపల్ చైర్మన్



ఆటోలో బాధితులను ఎక్కిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి స్పందించిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అప్పటికప్పుడు తన కారులో ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి దగ్గరుండి చికిత్స చేయించారు. గురువారం మధ్యాహ్నం పట్టణంలోని శాంతినగర్‌లో నేషనల్ హైవే వైపు నుంచి పట్టణంలోకి వస్తున్న బైకు, పట్టణం నుంచి హైవే వైపు వెళ్తున్న బైకు ఢీ కొన్నాయి. బైకులపై వెళుతున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర వెంటనే కారును ఆపి సంఘటన స్థలానికి వెళ్లారు. బైకుపై వెళుతున్న నలుగురిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో హాహాకారాలు చేస్తున్నారు. వెంటనే తన కారులో ఇద్దరిని, ఆటోలో ఇద్దరు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వారికి దగ్గరుండి చికిత్స చేయించారు. పరిస్థితి విషమిస్తే వారిని విజయవాడకు తరలించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబుకు సూచించారు. చైర్మన్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు సాధుపాటి రాజు, పందుల రోశయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, కాటగాని నరసింహారావు తదితరులు ఉన్నారు.

ముగిసిన ప్రచార పర్వం

రేపు పోలింగ్



మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న దాచవరం సర్పంచ్ అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు

వీరులపాడు: మండలంలోని దాచవరం సర్పంచ్, జమ్మవరం వార్డు ఉప ఎన్నికల ప్రచారం గురువారంతో ముగిసింది. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావటంతో సర్పంచ్ అభ్యర్థి గద్దె వెంకటేశ్వర్లు, వార్డు అభ్యర్థి ఇదుపులపాటి కటాక్షం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉంగరం గుర్తుపై ఓటు వేసి వెంకటేశ్వర్లును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గద్దె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తున్నారన్నారు. సేవ చేసే నాయకులకు ప్రజలు అండగా ఉంటే గ్రామాభివృద్ధి సులభతరమవుతుందని చెప్పారు. జమ్మవరంలో వార్డు సభ్యురాలు కటాక్షం మహిళలతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ రామిశెట్టి రత్నప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత తదితరులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలపై' అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: డాన్‌బాస్కో నవ జీవన్ బాల భవన్ సంస్థ, విజయవాడ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ జగ్గయ్యపేట కోఆర్డినేటర్ వి.అనిత మాట్లాడుతూ సిగరెట్, గుట్కా తదితర అలవాట్లు ఆరోగ్యానికి హానికరమన్నారు. స్కూల్ ఇన్‌చార్జ్ కె.హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

పటమట(విజయవాడ తూర్పు):యజమానులు కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ చెప్పారు. క్రెడాయ్ మహిళా విభాగం, ఆంధ్రా హాస్పిటల్స్, మాక్స్ విజన్ ఆధ్వర్యంలో క్రెడాయ్ బిల్డర్ల వద్ద పనిచేస్తున్న పలువురు భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 600 మంది కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు.